# అవ్యక్తం



**పాలపర్తి ధనరాజ్**

**"ఊఁపోనీయ్" వెనక నుంచి తోస్తూ అన్నాడు పైడిరాజు. ఒక్కసారి క్లచ్ నొక్కి వదిలాడు సూర్యం. మూడు చక్రాలలూనా రయ్యిమని ముందుకు సాగింది.**

ఒక చేత్తో హేండిల్ పట్టుకొని రెండో చేత్తో "క్రచస్"ని లోపల బాడీలోకి లాక్కున్నాడు. సూర్యానికో కాలు లేదు.

సూర్యం ఓ కిల్లీ షాపు యజమాని. ఇంటర్ వరకూ చదివాడు. బంగారు భవిష్యత్తు ఊహించుకుంటున్న రోజుల్లో అనుకోని దుర్ఘటనకు గురయి కాలుపోగొట్టుకున్నాడు.

వెళ్తున్న సూర్యం ఆలోచనలు ఎప్పటిలాగే గతాన్ని తవ్వుతున్నాయి. సూర్యం గతాన్ని మరువని వ్యక్తి. తనే స్థితిలో వుండేవాడో, ఇప్పుడెలా వుంటున్నాడు అతని కెప్పుడూ గుర్తుంటుంది.

కాలుపోగొట్టుకున్న కొన్ని రోజులకే కూలీ చేసుకొనే నాన్న చనిపోయాడు. నాలుగిళ్ళలోను అంట్లుతోమి సాదర ఖర్చు సంపాదించే అమ్మ మిగిలింది. సూర్యం జీవన పోరాటం మొదలయ్యింది. గవర్నమెంటు హాస్పిటల్ పుణ్యమా అని మూడు నెలలకు నయం కావలసిన కాలుసంవత్సరానికి బాగయ్యింది. 'క్రచెస్' మొదట్లో కొంచెం ఇబ్బంది కల్గించినా, తర్వాత అవసరమే వాటిని వాడడం నేర్పింది.

తను ఇంటర్ చదివేటప్పుడు చాలా మటుకు ఫస్ట్ క్లాసులే. డిబేటింగ్, ఎస్సే రైటింగ్‌లో కూడా మొదటి పేరులోనే వుండేవాడు. తనకిప్పటికీ గుర్తు 'ఎరాడికేషన్ ఆఫ్ బెగ్గింగ్' మీద తను చేసిన ఉపన్యాసం-దానికి తగినట్టు వచ్చిన ఫస్టు ప్రైజ్. అందుకనే కాలుపోయినా కాలానికి ఎదురొడ్డి నిలవాలని ఆశించాడు. భిక్షానికి మాత్రం లొంగకూడదు. ఇదే సూర్యం పట్టుదల!

ప్రభుత్వం చేసే సహాయాలన్నింటినీ వాకబు చేసాడు. 'హాండీ కాప్డ్' కున్న ప్రయోజనాలన్నీ చూసుకున్నాడు. అంతే "లోను' తీసుకొని, తనకి ప్రత్యేకంగా మూడు చక్రాలతో మోపెడ్ తయారు చేసికొని, మిగిలిన దాంతో కిళ్ళీ కొట్టు మొదలెట్టాడు. ఇప్పుడు సూర్యం ఓ షాపు యజమాని.

ఈ హోదాకి వచ్చిన సూర్యం తనని తాను ఎప్పుడూ మరచిపోడు. అదే సూర్యం ప్రత్యేకత.

మోపెడ్ జనసమ్మర్దం వున్న రోడ్డులోకి మళ్ళింది. జాగ్రత్తగా నడుపుతున్నాడు సూర్యం. ఈ లోగా ఓ చౌరస్తా వచ్చింది. పోలీసు చేయిపెట్టి ఆపడంతో బ్రేక్ వేసాడు సూర్యం.

రెండు నిమిషాలు గడిచాయి.

పోలీసు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు.

సూర్యం బండిని కొంచెం తోస్తేనే గాని స్టార్ట్ అవదు. బండిని తోసేవాళ్ళు లేరు.

అటూ ఇటూ చూసాడు. వెనక్కి తిరగపోయేంతలో "ఊఁ క్విక్, క్విక్" అని తొందరపెట్టాడు పోలీసు ముందుకి వెళ్ళమన్నట్టు.

అదే సమయంలో...

బండి ఎవరో తోస్తున్నట్టయింది. ఒకటి, రెండు... మూడు... అడుగుల దూరం వెళ్ళేసరికి స్టార్ట్ అయింది. కొంచం ముందుకి వెళ్లే సరికి టక్ టక్ మని శబ్దం వినిపించింది. మోపెడ్‌ని పక్కకి తీసి వెనక్కి తిరిగాడు.

ఇందకా తన మోపెడ్‌ని తోసిన వ్యక్తి అదోలా నవ్వుతూ నిలబడ్డాడు. ఆ కళ్ళలో ఏదో అవ్యక్తానందం. సూర్యం అతనికేసి చూసి అప్పుడు కిందకి చూసాడు. అతనికి ఓ కాలు లేదు. చేతులలో చెక్క క్రలు పెట్టుకుని సూర్యం బండినే చూస్తున్నాడు.

సూర్యం కళ్లు చటుక్కున చెమర్చాయి.

ఏ చరిత్రలోను, ఏవ్యక్తి జీవితంలోను చూడని అపూర్వమైన సంఘటనని సూర్యం చూస్తున్నాడు. కాళ్ళు లేని తన బండిని, కాలు లేని ఓ వ్యక్తి తోసి సాయం చేశాడు.

అనాలోచితంగా సూర్యం చేయి అతడిని రమ్మన్నట్టు పిలిచింది. దగ్గర కొచ్చాడతను. భిక్షం ఎత్తుకోడానికో జోలె అతని భుజాన వేలాడుతూ కన్పించింది సూర్యానికి.

రెండు నిమిషాలు గడిచాయి......

మోపెడ్ రయిమని కదిలింది.

ఇప్పుడు దాంట్లో ఒక్కరు కాదు ఇద్దరున్నారు. 'రేపటి నుంచి తనకి షాపు కెళ్లకుండా కొంచెం తీరిక దొరుకుతుంది. ఏదైనా ప్రక్క వ్యాపకం పెట్టుకోవాలి!' అనుకున్నాడు సూర్యం మనసులో!

అనుకోకుండా జరుగుబాటు దొరికినందుకు మనసులో రెండు చేతులూ జోడిస్తూ, భుజానికి కున్న జోలె జారవిడిచాడతను. ఇద్దరి మనసుల్లో చెప్పరాని అనుభూతి!

వప్పుగంతుల
మల్లికార్జునరావు
సంచలనాత్మక సీరియల్
ది నీడిల్
త్వరలో ప్రారంభం